



నేటి దినపత్రిక
# సూర్య
గుంటూరు పల్నాడు
www.suryaa.com
సోమవారం 02 మార్చి 2026 - పేజీలు 8

# నిర్వీర్యమైన ప్రభుత్వ శాఖలు

## నెలవారీ మామూళ్లకే సలాం



**అచ్చంపేట మేజర్ న్యూస్ :** పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలో అచ్చంపేట మండలం నందు నదీ పరివాహక ప్రాంతంలో మాదిపాడు, గిరిజుపల్లి, తాడువాయి, పుట్లగూడెం, చింతపల్లి, చామర్తి, కోగంటి వారి పాలెం ప్రాంతాలలో రోజు పడవ ప్రయాణం కొనసాగుతుంది. జడ్పీ ఆదేశాల మేరకు పాటలు నిర్వహించి నియమ నిబంధనలతో పడవ నడపాలని అగ్రిమెంట్ జరిగింది. మచిలీపట్నంలో అందించే ఫిట్నెస్ సర్టిఫికెట్ పడవలకు లేకుండానే, జడ్పీ ఆదేశాలు బె ఖాతారు చేస్తూ పడవ ప్రయాణాలు కొనసాగుతున్నాయి. గత రెండు మూడు మాసాల క్రితం గింజుపల్లి లో ప్రయాణికులతో కిలోమీటర్ మేర కొట్టుకుపోయిన సంఘటన స్థానికులకు విధితమే. ఈ విషయమై రెవిన్యూ అధికారులు పోలీసు అధికారులు మండల అభివృద్ధి పరిషత్ అధికారులు, కలసి ఫిట్నెస్ లేని పడవలకు నోటీసులు ఇచ్చి, కొన్ని పడవలను సీజ్ చేశారు. మరుసటి రోజునుండే యధాతధంగా పడవ ప్రయాణాలు కొనసాగుతున్నాయి. పోలీస్ శాఖకు జడ్పీ అధికారులకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు నెలవారి మామూళ్లు ఇవ్వడంతో ఉన్నతాధికారులు కన్నెత్తైనా చూడటం లేదని స్థానిక ప్రజలన్నారు.

3 లో

- సీజ్ చేసి మూడు మాసాలైనా కొనసాగుతున్న పడవ ప్రయాణం
- ఫిట్నెస్ లేకుండానే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పడవ పాటదారులు
- అధిక ధరలు, ఓవర్ లోడింగ్, నిబంధనలు పాటించని వైనం



# మీకోసం

## వెబ్ సైట్‌లో అర్జీలు సమర్పించవచ్చు

### సోమవారం పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్‌లు

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో మాత్రమే కాకుండా **"మీకోసం"** వెబ్ సైట్ లోను ఆన్ లైన్ లో ప్రజలు అర్జీలు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ తో పాటు నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ లను ప్రజలు ఉపయోగించు కోవాలని కోరారు. ప్రతి సోమవారం పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ లను ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. రెవిన్యూ క్లినిక్ లలో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, గుంటూరు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారులు గ్రామ స్థాయి రికార్డులతో హాజరు అవుతారని తెలిపారు.

3 లో

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

సత్యమేవ జయతే

- కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ :** గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా జిఎంసి విభాగాధిపతులతో కలిసి ప్రజల నుండి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### మేయర్ తీరు మార్చుకునేనా...

గుంటూరు నగరపాలక సంస్థకు మేయర్ గా వ్యవహారిస్తున్న కోవెలమూడి రవీంద్ర మార్చి రెండవ తేదీన జరిగే పి జి ఆర్ ఎస్ లో పాల్గొంటారా లేదా అనేది సందిగ్ధంగా మారింది. సంస్థలోని పంతులు అధికారులు కావాలని నన్ను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేశారని, చట్టం ఎలా ఉంటే అలా నడుచుకుంటానని సహచరుల వద్ద చెప్పినట్లు తెలిసింది. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునే కార్యక్రమం భాగంగానే పి జి ఆర్ ఎస్ లో కమిషన్ తో పాటు కూర్చున్నాని అంతకుమించి మరో దురుద్దేశం తనకు లేదని, కమిషనర్ హోదాను తగ్గించుకుంటున్న ఉద్దేశం కాదని, అందరం ప్రజా సమస్య పరిష్కారానికి, పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పినట్లుగా తెలిసింది. ఏది ఏమైనప్పటికీ అధికారికంగా పిజిఆర్ఎస్ లో పాల్గొంటారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

# మైనార్టీల అభివృద్ధికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వం

- కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్




**పెదకాకాని మేజర్ న్యూస్ :** ఒకవైపు ప్రభుత్వం మరోవైపు దాతల సహకారంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి చేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ముఖ్యంగా మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో డా॥ సూద్నగుంట రాఘవేంద్ర ప్రసాద్ శ్రీమతి కళ్యాణి తమ సొంత 60 లక్షలు నిధులుతో పెదకాకాని మండలం నంబూరు గ్రామం ముస్లిం ఏరియాలో ముస్లిమ్ షాది ఖానా

3 లో

# భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు పునరుద్ధరణ

### మార్చి 1 నుంచి అమలు : సహాయ కార్మిక కమిషనర్ షేక్ మహబూబ్ సుభాని



**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించినట్లు సహాయ కార్మిక కమిషనర్ నరసరావుపేట షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. జిల్లాలో నమోదైన లక్షకు పైగా కార్మిక కుటుంబాలకు ఈ పథకాలు వర్తించనున్నాయి. ప్రసూతి సాయం, పెళ్లి కానుక, సహజ మరణ ఉపశమనం, అంత్య క్రియల మట్టి ఖర్చు వంటి పథకాలు మార్చి 1 నుంచి అందుబాటులోకి రానున్నాయి. కార్మికుని భార్య లేదా కుమార్తెల ప్రసవానికి రూ.20,000 సాయం, సహజ మరణం సంభవిస్తే కుటుంబానికి రూ.60,000 ఆర్థిక సహాయం, అంత్యక్రియల ఖర్చులకు రూ.20,000 అందజేయనున్నారు. వివాహానికి కూడా ప్రత్యేక సాయం అందుతుంది. 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల భవన నిర్మాణ కార్మికులు ఈ పథకాల కోసం దరఖాస్తు చేసుకో వచ్చని, సంబంధిత ధ్రువపత్రాలతో ఆరు నెలల్లోపు లేదా నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేయాలని సూచించారు. సందేహాలుంటే సమీప కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పోలీసులు ర్యాలీ



**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ డి.ఎస్.పి అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మహిళల భద్రత, గౌరవం, సాధికారతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమశీ విజ్ఞాన మందిరం నుండి ఆర్ కే టి సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. మహిళలు అందరూ ధైర్యంగా ముందుకు రావాలనీ ఏదైనా ఇబ్బంది కలిగినప్పుడు డైల్ 112 కి, శక్తి టీమ్ ను కానీ వినియోగించుకోవాలని లేదా నేరుగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. రక్షక్ వాహనం 24 గం లు సేవలు అందిస్తుందని తెలియజేశారు. సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, కుటుంబ స్థాయి నుంచే బాలికలకు సమాన హక్కులు అవకాశాలు కల్పించాలన్నారు. యువతలో లింగ సమానత్వంపై చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా పోలీస్ సిబ్బందితో పాటు వార్డు మహిళా పోలీసులు, విద్యార్థినులు ర్యాలీలో పాల్గొని మహిళా రక్షణ, చట్టపరమైన అవగాహన, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలపై ప్రజలకు సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎస్ ఐ డి రమేష్, పి . సుబ్బారావు, లాలాపేట ఎస్ ఐ వెంకట్రావు, పాతగుంటూరు ఎస్ ఐ రెహమాన్ లు, ట్రాఫిక్ సిబ్బంది, గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది, పాఠశాలల విద్యార్థునులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సిపిఐ 'గడపగడప' కార్యక్రమం విరాళాల సేకరణకు పిలుపు



**వినుకొండ మేజర్ న్యూస్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు వినుకొండ పట్టణంలో సిపిఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో 'గడపగడప సిపిఐ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న పేద, దళిత, బలహీన వర్గాలు, కార్మికులు, ఉద్యోగులు, రైతాంగానికి వ్యతిరేక విధానాలపై సిపిఐ సమరభేరి మోగిస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఉద్యమాలకు సిపిఐ నిరంతరం అండగా నిలుస్తోందని చెప్పారు. ప్రజల మద్దతుతో విరాళాలు సేకరించి ఉద్యమాలను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉలవలపూడి రాము, రాయబారం వందనం, కొప్పరపు మల్లికార్జున, మహంకాళి సుబ్బారావు, కొండ్రముట్ల సుభాని, దారివేముల మరియబాబు, సోడాల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళ సాధికారతే లక్ష్యంగా సాగిన అవగాహన ర్యాలీ

### మహిళలు ఆత్మవిశ్వాసంతో స్వయం సాధికారత సాధించాలి







**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ను పురస్కరించుకొని నరసరావు పేట ఎస్ఎస్ఎన్ కాలేజీ నుంచి పల్నాడు బస్టాండ్ వరకు,సత్తెనపల్లి డీస్పీ ఆఫీసు నుండి ఐదు లాంతర్ల సెంటర్ వరకు, మాచర్ల పోలీస్ స్టేషన్ నందు మహిళ పోలీసులు, మహిళ పోలీసు సిబ్బంది, కళాశాల విద్యార్థి నులతో ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మహిళా సాధికారత, చైతన్యం, ప్రగతి తదితర అంశాలపై జై జై పలికారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర డిజిపి ఉత్తర్వులు మేరకు జిల్లా వ్యాప్తంగా మహిళా సాధికారత వారోత్స వాల్లో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. మహిళలపై జరుగుతున్న అన్యా యాలు, వేధింపులు, చట్టపరమైన హక్కులు, భద్రతా చర్యలపై ప్రజలకు సమగ్రంగా అవగాహన కల్పించారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలను ధైర్యంగా వెలుగులోకి తీసుకు రావాలని, చట్టపరమైన సహాయం పొందేందుకు ముందు కు రావాలని సూచించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం, పోలీస్ శాఖ అమలు చేస్తున్న చర్యలను వివరించారు. మహిళలు తమ హక్కు లను తెలుసుకొని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి స్వయం సాధికారత సాధించాలని పోలీస్ అధికా రులు పిలుపునిచ్చారు. స్కూల్ విద్యార్థినిలు, గ్రామీణ స్త్రీలకు, బాలికలకు మహిళా చట్టాలపై అవగా హన కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు చిన్నారులు భద్రతకు జిల్లా పోలీసు యంత్రాంగం అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా పోలీస్ శాఖ వారు అందించే పోలీస్ సేవలను జిల్లా మహిళలు అందరు సద్వినియోగం చేసుకోవా లని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ నిరంజన్, గురజాల సబ్ డివిజన్ డిఎస్పి ఎం.వెంకటరమణ, డిఎస్పి ఎం.హనుమంతరావు పలు పోలీస్ స్టేషన్ అధికారులు, ఎస్సైలు, వివిధ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# మూసివేత దిశగా చిన్న పరిశ్రమలు

## అమరావతి ఫ్లైయాష్ బ్రిక్స్ మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ సమావేశంలో వ్యాపారుల ఆవేదన




**మంగళగిరి మేజర్ న్యూస్ :** ఫ్లైయాష్ ఇటుకలకు మార్కెట్‌లో గిరాకీ పెరిగినప్పటికీ ఫ్లైయాష్ నిర్వహణలో పారదర్శకత లోపించడంతో సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అమరావతి ఫ్లైయాష్ బ్రిక్స్ మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ముఖ్యసలహాదారు ఎన.కాళిదాస్ ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం మంగళగిరి మండలం చినకాకాని హాయ్‌లాండ్‌లో ఆదివారం జరిగింది. కాళిదాస్ మాట్లాడుతూ 1990 దశకంలో బూడిద నిల్వలతో ప్రభుత్వాలు సతమతమవుతున్న సందర్భంలో సాంకేతికత ఆధారంగా అనేక మంది ఫ్లైయాష్ ఇటుకల పరిశ్రమలను స్థాపించారని తెలిపారు. గతంలో సీఎం చంద్రబాబు ఫ్లైయాష్ పరిశ్రమలకు వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్సహించారని గుర్తుచేశారు. ఆ ఫలితంగా రాష్ట్రంలో సుమారు ఐదు వేల పైచిలుకు సూక్ష్మ, లఘు పరిశ్రమలు ఏర్పడి లక్షలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. ఫ్లైయాష్ ఉత్పత్తి ఇబ్బడిముబ్బడిగా పెరిగినప్పటికీ చిన్న పారిశ్రామికవేత్తలకు ఫ్లైయాష్ దొరకడం దుర్లభమైందని పేర్కొన్నారు. ఒకపక్క యాష్ పాండ్‌లు నిండిపోతుంటే మరోపక్క ఫ్లైయాష్ దొరక్క పరిశ్రమలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో ఫ్లైయాష్ కృత్రిమ కొరత సృష్టించడంతో చిన్న వ్యాపారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్బన ఉద్గారాలను తగ్గించి, సారవంతమైన మట్టినీ, బొగ్గు వంటి ఇంధనాన్ని మిగుల్చుతూ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్‌కు ఊతమిచ్చే ఫ్లైయాష్ సేవలను కేంద్ర ప్రభుత్వం విస్మరించి ఉచితంగా ఇచ్చే వ్యర్థ బూడిదకు ధరలు నిర్ణయించడం బాధాకరమన్నారు. ఈ విషయమై తాము నేషనల్ గ్రీన ట్రిబ్యూనల్‌లో కేసు వేసి గెలవడం జరిగిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం తీరులో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఫ్లైయాష్ ఇటుకల తయారీ పరిశ్రమలను కాపాడుకునేందుకు ఉద్యమ బాట పట్టనున్నామని, రాబోయే రోజుల్లో భవిష్యత కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అమరావతి ఫ్లైయాష్ బ్రిక్స్ మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన అధ్యక్షుడు వెలగా సాంబశివరావు, ఉపాధ్యక్షుడు ఐబీ చౌదరి, కార్యదర్శి బి.శ్రీనివాసరావు, కోశాధికారి కే.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల ఐటిఐ కళాశాల, హాస్టల్ భవనాలను తక్షణమే ప్రారంభించాలి

## మైనార్టీల సంక్షేమం కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి ఉద్యమానికి పిలుపునిస్తాం

### - మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి





**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పట్టణ శివారు ములకలూరు గ్రామం వద్ద మైనార్టీల కోసం నిర్మించిన ఐటిఐ కళాశాల, హాస్టల్స్ ను కూటమి ప్రభుత్వం, స్థానిక శాసనసభ్యుడు కేంద్రీయ విద్యాలయానికి అప్పజెప్పటాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వందలాదిమంది ముస్లిం మైనార్టీ కార్యకర్త లతో కలిసి ఐటిఐ కళాశాల వద్ద ధర్నా కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముస్లిం సోదరుల కోసం నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేశారని, ఈ రిజర్వేషన్ సౌకర్యంతో ముస్లిం సోదరులు తమ పిల్లల చదువు మీద దృష్టి పెట్టి తమ పిల్లలను ఉన్నత స్థాయి చదువులు చదివించుకుంటున్నారని వైయస్ రాజశేఖర్ రెడ్డి మైనార్టీల సంక్షేమం కోసం అనేక ప్రాంతాల్లో మైనార్టీ ఐటిఐ కళాశాలలను హాస్టల్స్ ను నిర్మించరన్నారు. నరసరావుపేట ప్రాంతంలో ములకలూరు గ్రామం వద్ద ఐటిఐ కళాశాలను హాస్టల్స్ ను నిర్మించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఇప్పటికి రెండేళ్లు పూర్తయినా ఈ కళాశాల భవనాలను ప్రారంభించడానికి కనీస ప్రయత్నం కూడా చేయలేదన్నారు. నరసరావు పేట జిల్లా హెడ్ క్వార్టర్స్ అయిన తర్వాత ఎస్పీ ఇక్కడ ఎస్పీ ఆఫీస్ పెట్టాలని ప్రయత్నం చేస్తే అప్పట్లో ఆ ప్రయత్నాలను మేము అడ్డుకొని మైనార్టీ సోదరుల కోసం కేటాయిం చిన భవనాలను మైనార్టీలకే చెందాలని అంకితభా వంతో పనిచేశామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ భవనాలను కేంద్రీయ విద్యాలయానికి కేటాయిం చారని, మైనార్టీల భవనాలను కేంద్రీయ విద్యాలయా నికి కేటాయించడానికి స్థానిక ఎమ్మెల్యే అరవింద్ బాబు ముందుగా అనుమతి ఇచ్చి ప్రస్తుతం తన పార్టీ వారిని కళాశాల భవనాల వద్ద ధర్నా చేయించి షో చేస్తున్నాడు అన్నారు. నిజంగా మైనార్టీల కోసం పాటుపడే వాడివైతే నీ అధికారాలను ఉపయో గించి ఎందుకు అడ్డుకోవట్లేదని తీవ్రంగా ప్రశ్నిం చారు. తక్షణమే ఐటిఐ కళాశాలను హాస్టల్స్ను ప్రారంభించా లని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా మైనార్టీ నాయకు లను సమీకరించి వేలాది మందితో ఉద్యమం నిర్వహిస్తామని తెలియజే శారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశ్రయ చారిటబుల్ ట్రస్టు సేవలను మరింత విస్తృతం చేస్తాం

## "భారత్ ఎక్సెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవం" విజయవంతనికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

## - ట్రస్ట్ డైరెక్టర్ దీపాల పరంధామయ్య






**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** ఆశ్రయ చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో భారత్ ఎక్సెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చైర్మన్ దీపాల పరంధామయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రస్తు కార్యక్రమాలు,భవిష్యత్తు ప్రణాళికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విజయవాడ లోని బాలోత్సవ భవన్ లో శనివారం అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించామన్నారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిస్ ఇండియా పి అండ్ ఐ 2025 అంబాసిడర్ బి. అమూల్య ప్రియదర్శిని,విశిష్ట అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ భాష సాంస్కృతిక శాఖ డిప్యూటీ డైరెక్ట్ పెంచలయ్య ,గౌరవ అతిథి సన్మాన అవార్డ్ గ్రహీత అయిన అంతర్జాతీయ చిత్రకారులు డాక్టర్ వజ్రగిరి జెస్టిస్ హాజరు అయ్యారని వివరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వజ్రగిరి జస్టిస్ మాట్లాడుతూ సమాజంలో ఉన్న ఉన్నతమైన విశిష్టమైన సేవ భావాలు ఉన్న వ్యక్తులు అందరిని గుర్తించి వారికి అవార్డ్స్ అందించటం చాలా గొప్ప విషయం అని,వీరికి ఆశ్రయ చారిటబుల్ ద్వారా అవార్డ్స్ అందిస్తున్న ట్రస్టు చైర్మన్ దీపాల పరంధామయ్య ని అభినందించారు.డిప్యూటీ డైరెక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయటం అంటే చిన్న విషయం కాదు అని, సమాజ శ్రేయస్సు కోరేవారు, సమాజంలోని ఉన్న అందరూ వ్యక్తులు అంఅందరూ బాగుండాలి అనుకునేవారు, పరోపకారం కోరుకునే వారు మాత్రమే ఆ పనులు చేయగలరు అని, అటువంటి వారిలో దీపాల పరంధామయ్య అగ్రగణ్యులు అని అన్నారు. ముఖ్య అతిథి అయిన మిస్ ఇండియా అంబాసిడర్ బి.అమూల్య అమూల్య ప్రియదర్శిని మాట్లాడుతూ ఆశ్రయ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరంధామయ్య చేస్తున్న సేవా కార్యక్రమాలు చూసాను అని,ఇంత చిన్న వయసులో ఇలాంటి గొప్ప పనులు,సేవా కార్యక్రమాలు చేస్తున్న పరంధామయ్య అభినందనలు అని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్య, వైద్యం, ఫ్యాషన్ డిజైన్, సోషల్ సర్వీస్, రీసెర్చ్, లీగల్, పొలిటికల్ సైన్స్, క్రీడలు, స్విమ్మింగ్, లైబ్రరీ సైన్స్ వివిధ రంగాలకు చెందిన 20 మంది ప్రముఖులకు అవార్డ్స్ అందచేయటం జరిగింది. అవార్డ్స్ అందుకున్న వారు ధూళిపాళ్ల కోటేశ్వరరావు, క్రీడరత్న శివరామ శేషయ్య, దేశబోయిన మానస, భిక్షలమ్మ, సిద్దు, సురేష్, కోటేశ్వరరావు, మాతంగి సాంబశివరావు, కాదరబాద నాగేశ్వరరావు, కొప్పురావూరి కాశి వెంకట సుబ్బారావు, అత్తోట రవికుమార్, చింతపల్లి లాజర్, బుల్లా రాజారావు మొదలైన వారు ఉన్నారు. తదనంతరం ముఖ్య అతిథి అయిన అమూల్య ప్రియదర్శిని చేతుల మీదుగా అంతర్జాతీయ చిత్రకారులు వజ్రగిరి జెస్టిస్ కి భారత్ ఎక్సెన్స్ అవార్డ్ అందించి ఘనంగా సన్మానించటం జరిగింది, డిప్యూటీ డైరెక్టర్ పెంచలయ్యని సన్మానించడం జరిగింది. ముఖ్య అతిథి అయిన మిస్ అమూల్య ప్రియదర్శిని కి అవార్డ్ ఇవ్వటం సన్మానించడం జరిగింది.

## మహిళలకు సమాన గౌరవం, సాధికారత చైతన్యమే లక్ష్యం

### పోలీసుల ఆధ్వర్యంలో.. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల నిర్వహణ

### - పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** మహిళలకు సమాజంలో సమాన గౌరవాన్ని, అన్ని సమయాల్లో రక్షణను, సమగ్ర సాధికారత కోసం పోలీసు వ్యవస్థ తమ వంతు కృషి చేస్తుందని సత్తెనపల్లి పట్టణ సిఐ నరహరి నాగమల్లేశ్వరరావు అన్నారు. ముందుగా అంతర్జాతీయ మహిళా (ఈ నెల 8న )దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణ పోలిసు స్టేషన్ వద్ద నుండి తాలూకా సెంటర్, గడియార స్తంభం మీదుగా ఐదు లాంతర్ల సెంటర్ వరకు ర్యాలి నిర్వహించటం జరిగింది. మహిళా సాధికారత, భద్రత పై అవగాహన కల్పించేందుకు ర్యాలీలో నినాదాలు చేశారు. అనంతరం కాకతీయ కళ్యాణ మండపంలో... మహిళామణుల కి ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులు, చిన్నారులు చైతన్యవంతులు కావాలన్నారు. సమాజ ప్రగతికి మహిళల పట్టుదల విశ్వాసమే పునాదులను వివరించారు. చట్టాలపై కనీస అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో... ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ సుజాత సీడీపీఓ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీలత కృష్ణవేణి జూనియర్ కాలేజీ కరస్పాం డెంట్ శ్రీనివాసరావు,



ఎస్సీ గార్ల్స్ హాస్టల్ వార్డెన్ (నాగన్నకుంట) సుమని పట్టణ ఎస్సైలు ఎం పవన్ కుమార్, రాజశేఖర్ సిబంది పాల్గొన్నారు. సుమారు 250 మంది మహిళా మణులు అనగా విద్యార్థినులు, అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ వారు, అంగన్వాడీలు, ఆషా వర్కర్లు మొదలైన మహిళలు పాల్గొన్నారు. మహిళల ఇండోర్ క్రీడలో భాగంగా చెస్, క్యారమ్స్, హ్యాండ్ రింగ్ వంటి క్రీడలు నిర్వహించారు.

# మీకోసం వెబ్ సైట్ లో అర్జీలు సమర్పించవచ్చు

మొదటి పేజీ తరువాయి

మండలాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేసి, ప్రజల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించి నమోదు చేయడంతో పాటు, సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. అప్పటికప్పుడే పరిష్కారం చేయలేని సమస్యలను వారం రోజులలో పరిష్కారం చేయుటకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను డివిజనల్, మండల రెవిన్యూ అధికారులు సమర్పిస్తామని వివరించారు. రెవెన్యూ క్లినిక్ కు నాలుగు కౌంటర్ లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు.

### మీకోసం వెబ్ సైట్ లో ఆర్జీలు సమర్పించవచ్చు

ప్రజలు తమ సమస్యలను మీకోసం వెబ్ సైట్ లోను అర్జీలు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ చెప్పారు. అర్జీల వివరాలు Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పి.జి.ఆర్.ఎస్ ను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పి.జి.ఆర్.ఎస్ లో సమర్పించిన అర్జీల స్థితిని 1100 టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. అర్జీలను మీకోసం వెబ్ సైట్ లోను సమర్పించవచ్చని చెప్పారు.

# మైనార్టీల అభివృద్ధికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

నిర్మాణానికి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర డా॥ సూద్నగుంట రాఘవేంద్ర ప్రసాద్ శ్రీమతి కళ్యాణి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ వడ్రణం మార్కొండేయ బాబు గారు మండలంలోని కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు అనంతరం నంబూరు గ్రామం ఈశ్వరమ్మ అమ్మ వారి గుడి 18 వ వార్షికోత్సవం సందర్బంగా అమ్మ వారికీ జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మ వారిని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆంధ్రప్రదేశ్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వడ్రణం మార్కొండేయ బాబు దర్శించుకున్నారు నంబూరు గ్రామంలో ముస్లిం సోదరులు నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందు నందు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆంధ్రప్రదేశ్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వడ్రణం మార్కొండేయ బాబు పాల్గొన్నారు.



## నిర్వీరమైన ప్రభుత్వ శాఖలు, నెలవారీ మామూళ్లకే సలాం

మొదటి పేజీ తరువాయి

### నిబంధనలు పాటించరు

ప్రతి పడవలో సేఫ్టీలు ఉంచుకోవాలి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. టిక్కెట్టు ధర నిర్ణయించి టిక్కెట్లు ఇవ్వాలి. ఓవర్ లోడ్ ప్రయాణం చేయకూడదు. పడవలలో వాహనాలను తరలించకూడదు. మద్యం గంజాయి లాంటివి తరలించకూడదు. ఇలా కొన్ని నిబంధనలతో కూడిన అంశాలతో అనుమతులు ఇచ్చారు. ఒక్క ప్రదేశంలో నైనా నిబంధనలు పాటిస్తూ పడవ ప్రయాణం కొనసాగటం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

### ఎంపీడీవో, సర్కిల్ ఇన్స్పెక్టర్ వివరణ


ఫిట్నెస్ లేని పడవలకు గతంలో నోటీసులు ఇచ్చి సీజ్ చేసాం. మరలా ప్రయాణం కొనసాగిస్తున్నారు అనే విషయం మా దృష్టికి వచ్చింది ఈ విషయం పై ఉన్నత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటాం.

## ముటుకూరులో అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహణ




**దుర్గి మేజర్ న్యూస్ :** దుర్గి మండలంలోని ముటుకూరు గ్రామం లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహాల వద్ద అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎంఆర్పీఎస్ మాదిగ స్టూడెంట్స్ పరిరక్షణ సమితి ఎంఎస్పీ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పోరాటంలో మందా కృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిన ఉద్యమాలలో జాతి భవిష్యత్తు కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి అమరులైన మాదిగ అమరవీరులకు ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి వారి త్యాగాలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ దుర్గి మండల ఇంచార్జి పులిమెల్ల అన్నారావు మాదిగ, ముటుకూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు మాచర్ల సురేష్ మాదిగ, ఉపాధ్యక్షుడు మాచర్ల ఆంధ్రయ్య మాదిగ, గ్రామ కమిటీ నాయకులు పులిమెల్ల మరియదాసు, మాచర్ల పురుషోత్తం, మాచర్ల వసంతం, మాచర్ల దేవదానం, మాచర్ల సతీష్, మాచర్ల ఆదాం, ఫీల్డ్ అసిస్టెంట్ మాచర్ల శ్రీను, మాచర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం ముగింపులో మృత వీరులకు జోహార్లు అర్పిస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించారు. అమరవీరుల ఆశయ సాధన కోసం పోరాటం కొనసాగుతుందని నాయకులు తెలిపారు.

## పదవి విరమణ కార్యక్రమం




**పిడుగురాళ్ల రూరల్ మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల (రూరల్) పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎరపతినేని పిడుగురాళ్ల పట్టణంలో పంచాయతీరాజ్ డిఇ కోటేశ్వరరావు పదవి విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమంలో జరిగింది. డిఇ కోటేశ్వరరావు ని పిడుగురాళ్ల రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు, డిసీ ఫైవ్ చైర్మన్ గండికోట వెంకటేశ్వర్లు దుశ్యాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది.

## వేమవరంలో ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ ఆనందరావు



**మాచవరం మేజర్ న్యూస్ :** మండలంలోని వేమవారం గ్రామంలో మార్చి నెల లో వచ్చిన నూతన పింఛన్లు పిడుగురాళ్ల మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ ఏసుపొంగు ఆనందరావు పంపిణీచేశారు. భర్తకు పించన్ వస్తువుండగా అతను చనిపోతే ఆ ఫించన్ అతని భార్య కు వెంటనే మంజూరు చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం ముందుగా పించన్ ఇవ్వటం హ్యాట్రిక్ సాధించింది అని ఆయన అన్నారు.

# విద్యార్థుల్లో పోటీతత్వం పెంపుకు ఒలింపియాడ్ దోహదం

## - ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పోటీ తత్వం, విశ్లేషణాత్మక ధోరణి పెంపొందించేందుకు ఒలింపియాడ్ పరీక్షలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్సీ ఎమ్.వి.రామచంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్రంలోని పలకలూరు చైతన్య స్కూల్లో ఈ అభ్యాస్ అకాడమీ, కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (కె శాట్) లెవెల్ - 2 ఒలింపియాడ్ ప్రతిభా పరీక్షలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ, అపస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్.వి.రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఇలాంటి ప్రతిభా వేదికలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఆ దిశగా అపస్మా నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ.అభ్యాస్ అకాడమీ చైర్మన్ డాక్టర్ భువనగిరి ఫణి పవన్ శాస్త్రి మాట్లాడుతూ, కలాం స్ఫూర్తితో నిర్వహిస్తున్న కె శాట్ పరీక్షలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పిస్తున్నాయని వివరించారు. లెవెల్ - 2 ద్వారా రాష్ట్ర స్థాయి ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, చైతన్య స్కూల్స్ డైరెక్టర్ సాంబిరెడ్డి, అపస్మా స్టేట్ మెంబర్ కొండవీడు మస్తాన్ రావు, స్కూల్ డైరెక్టర్లు బద్దిగం శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఏరువ శ్రీవేణి, పి.అభినందన్ రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పాఠశాలల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# 1979- 82 బికాం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**పొన్నూరు మేజర్ న్యూస్ :** పిబిఎన్ కళాశాలలో 1979- 82 బికాం చదువుకున్న పూర్వ విద్యార్థుల తృతీయ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పొన్నూరు మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామ పరిధి లో ఉన్న కొప్పాక శ్రీనివాస్ ఫామ్ హౌస్ పొన్నూరు లో కోళ్లపూడి కిషోర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సుమారు 44 ఏళ్ల తర్వాత గత సంవత్సరం ప్రారంభమైన ఈ సమ్మేళనం కొనసాగింపుగా ఈ ఆదివారం అనగా 1/3/2026 న అందరూ కలిసి ఉత్సాహంగా ఉల్లాసంగా సరదాగా ఒకరికొకరు వారి ఈ 44 ఏళ్ల ప్రస్థానంలో వారు సాధించిన పురోగతి పంచుకోవడంతో పాటు చదువుకున్న సమయంలో వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇదే విధంగా అందరూ ఒకరికొకరు సహకరించుకోవటంతో పాటు సమాజసేవ కు తమ వంతు కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విధంగా కలుసుకోవటం ఎంతో ఆనందాన్ని కలిగించిందని దీన్ని కొనసాగించుకుందామని నిర్ణయించుకున్నారు. ఇంకా మిగిలిన సభ్యులను కూడా చేర్చే విధంగా ఈచ్ వన్ క్యాచ్ వన్ విధానం ద్వారా సభ్యులను చేర్చుకోవాలని నిర్ణయించారు. ఈ రోజున సభ్యులు వెంటప్పయ్య మరియు కిషోర్ గారి సతీమణి కృష్ణకుమారి గారి జన్మదినం వలన మిగిలిన సభ్యులు వారి జన్మదిన వేడుకలు గా కేక్ కటింగ్ చేపించారు తద్వారా పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిబిఎన్ కళాశాల 1979–82 బికాం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కొనసం రామ్మోహన్ రావు, కార్యదర్శి కోళ్ళపూడి కిషోర్, ట్రెజరర్ వై. శివరామకృష్ణ ,సభ్యులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వివా "ఐబి" విద్యార్థుల పి.వై.పి. ఎగ్జిబిషన్

**పెదకాకాని మేజర్ న్యూస్ :** వివా ది స్కూల్ నందు ఇంటర్నేషనల్ బాకలారియేట్ పి.వై.పి (ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్) చివరి సంవత్సరం (5వ తరగతి) విద్యార్థులు, తాము తరగతి గదిలో అభ్యసించిన అంశాలపై అవగాహనను, సృజనాత్మకతను మరియు నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసిన 'పి.వై.పి.ఎక్స్' విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు "ఐబి" విద్యావిధానం ద్వారా అభ్యసించిన విద్య, విద్యేతర అంశాలలో సాధించిన ప్రావీణ్యాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో ప్రదర్శించారు."మనం ఎలా వ్యవస్థీకృతం అవుతాము" అనే ప్రధాన ఇతివృత్తంతో , వ్యవస్థల పనితీరు మరియు సామూహిక నిర్ణయాల ద్వారా సామాజిక మార్పు వంటి అంశాలపై విద్యార్థులు చేసిన పరిశోధనలు వివరించారు. వాతావరణ మార్పులు, నీటి సంరక్షణ, ఆహార భద్రత వంటి అంశాలపై వారు రూపొందించిన నమూనాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ఇటీవల సందర్శించిన పర్యాటక ప్రాంతాల విశిష్టతను వివరిస్తూ రాసిన వ్యాసాలు, ఛాయాచిత్రాలను కూడా ఈ ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమాన్ని సందర్శించిన తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతిని చూసి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, పాలక సభ్యురాలు వాసిరెడ్డి ప్రత్యూష అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్టి. కమాండర్ కె.ఎస్. రావు, ప్రిన్సిపాల్ సి.హెచ్. సరళ, ఐ.బి. సమన్వయకర్త కె. మాధవి, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# వీడియోలతో వివాహితను వేధిస్తున్న ప్రియుడిపై కేసు

**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్:** గుంటూరు టౌన్ కొరిటేపాడు కి చెందిన ఒక యువతికి నగరం లోని ఒక ప్రైవేటు కాలేజీ లో చదువుకొనే సమయం లో ఒక ప్రకాశం జిల్లా కి చెందిన యువకుడు తో పరిచయం ఏర్పడినది . వారిద్దరూ ప్రేమించుకొన్నట్లు, ఆ సమయము లో వారిద్దర్లు శరీరకంగా కలిసిన సమయము లో సదరు యువకుడు వీడియోలు తీసుకున్నాడు. అనంతరం వారి మధ్య గొడవల కారణంగా విడిపోయినారు. ఆ యువతి వేరే వ్యక్తిని పెళ్లి చేసుకోగా... సదరు యువకుడు ఆ వీడియోలు యువతి భర్త, తండ్రి కి పంపి బెదిరింపులకు పాల్పడ్డాడు. యువతి తండ్రి ఇచ్చిన రిపోర్టు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర పూజలు

**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెదకూరపాడు లోని శ్రీ నాగమల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి స్వామివారికి పూజలు జరిగాయి. తెల్లవారుజామునే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. శ్రీ స్వామివారికి విభూది పూజలు జరిగాయి.ఆవుపాలు,పండ్లు, తేనె తదితరములతో శ్రీ స్వామివారికి పంచామృత అభిషేకములు జరిగాయి.అర్చక స్వామి కిషోర్ శాస్త్రి స్వామివారికి పూజలు నిర్వహించారు.తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి గణేష్, కృష్ణమనేని లక్ష్మయ్య,అనుముల రామలింగేశ్వరరావు,వర్తక ప్రముఖులు బాపయ్య,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 3, 4, తేదీల్లో ఎస్‌హెచ్‌ఓలో ప్రకృతి ఛాయాచిత్ర ప్రదర్శన



**గుంటూరు మేజర్ న్యూస్ :** సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ నేచర్ ఫోటోగ్రాఫర్ టి.ఎన్. వరప్రసాద్ సహకారంతో ప్రకృతి ,పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా 2/1 బ్రాడీపేట లోని ఎస్ హెచ్ ఓ సమావేశ మందిరంలో మార్చి 3,4 తేదీలలో"ప్రకృతి ఛాయాచిత్ర ప్రదర్శన "నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ టి .సేవకుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మార్చి 3తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రదర్శన 4వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఉంటుందన్నారు. ఈ ఛాయాచిత్ర ప్రదర్శన ప్రారంభోత్సవ సభలో ప్రఖ్యాత వైద్యులు ,ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ డాక్టర్ ఎన్ వెంకటరమణ ,జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ పట్ల అధ్యక్ష కార్యదర్శులు, ఎన్. సతీష్ కుమార్, ఎం .రవి కుమార్ ,పట్నా గౌరవ సలహాదారు కె. కృష్ణ తదితరులు పాల్గొంటారన్నారు.. ఈ ప్రదర్శనలో ప్రకృతి ఫోటోగ్రఫీలో ఆసక్తి గలవారికి టి .ఎన్ .వరప్రసాద్ మెళుకువలు తెలుపుతారన్నారు .ప్రజలు అధిక సంఖ్యలో ప్రదర్శన సందర్శించి విజయవంతం చేయాలని డాక్టర్ టి . సేవ కుమార్ ఆ ప్రకటనలో కోరారు.

# తలశిల చంద్రశేఖర్‌రావు పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్న అంబటి



**పొన్నూరు, మేజర్ న్యూస్ :** విజయవాడ గొల్లపూడి గ్రామం నందు శాసనమండలి సభ్యులు తలశిల రఘురాం తండ్రి తలశిల చంద్రశేఖర్ రావు పెద్దకర్మ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త అంబటి. మురళీకృష్ణ పాల్గొన్నారు. వారికుటుంబ సభ్యుల ను పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## భాష్యం రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన ఎమ్మెల్యే దంపతులు



**గుంటూరు మేజర్ న్యూస్:** భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్ లోని భాష్యం విద్యాసంస్థల కార్యాలయం నందు జరుగుతున్న వేడుకలకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, శ్రీ భ్రమర టౌన్ షిప్స్ అధినేత గళ్ళా రామచంద్రరావు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకి మొక్కను బహుకరించి, శుభాకాంక్షలు తెలిపారు.

## లిఖిత ప్రతిభకు చీఫ్ విప్ జీవీ ప్రోత్సాహం



**వినుకొండ మేజర్ న్యూస్ :** ఇండోనేషియాలో ఈనెల 14 నుంచి 19 వరకు జరిగిన బాల్ బ్యాడ్మింటిన్ టెస్ట్ సిరీస్లో గెలుపొందిన ఇండియా జట్టులో శావల్యాపురం మండలంలోని కనమర్లపూడికి చెందిన ముక్కపాటి లిఖిత అత్యుత్తమ ప్రదర్శన చేసి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించింది. స్వదేశానికి చేరుకున్న ఆమె ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ని ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంలో జీవి ఆంజనేయులు లిఖితను ప్రత్యేకంగా అభినందించారు. లిఖిత భవిష్యత్తులో మరింతగా రాణించి జాతీయస్థాయిలో పేరు ప్రతిష్టలు సంపాదించాలని జీవి ఆంజనేయులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రూ. 25వేల ఆర్థిక సాయం క్రీడాకారుని లిఖితకు జీవీ ఆంజనేయులు అందజేశారు. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఊపందుకున్న జనసేన మెంబర్షిప్ డ్రైవ్



**తాడేపల్లి మేజర్ న్యూస్ :** చిల్లపల్లి శ్రీనివాసరవు అదే శాలతో ఇంటింటా ప్రచారం జనసేన క్రియాశీల సభ్యత నమోదు కార్యక్రమం ఉండవల్లి సెంటర్లో జనసేన మంగళగిరి నియోజకవర్గ నాయకులు జొన్న రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం భారీ క్యాంపెయిన్ చేపట్టారు. ఇంటింటికి సభ్యులను చేర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ వెళ్లిన ప్రతి ఇంటికి ఆత్మీయుడీలా ఆదరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పవన్ కళ్యాణ్ పార్టీని ఆదరించవలసిందిగా కోరారు. ఆంధ్ర రాష్ట్రానికి పవన్ కళ్యాణ్ అవసరం ఉందని ఆయనకి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తారని ప్రజలు ముందుకు వచ్చారని ఈ సందర్భంగా రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుర్రాల శేషగిరి, దాసరి దుర్గా మల్లేశ్వరరావు, సామల శశి, గాజుల సాయి తేజ,అఖిల్, బన్నీ, శశిధర్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

## మిగిలిపోయిన భోజనాలతో పేదల కడుపు నింపే ప్రయత్నం



**పెదకూరపాడు మేజర్ న్యూస్:** ఫంక్షన్లలో మిగిలిపోయిన భోజనాలతో కడుపు నింపే ప్రయత్నం నిరంతరం కొనసాగిస్తామని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. పెద్దకూరపాడుకు చెందిన చేగు సురేష్ గృహంలో ఆదివారం జరిగిన శుభకార్యంలో మిగిలిన ఆహారం గురించి చావా ప్రసాద్ బాబు జన చైతన్య సమితి (జె సి ఎస్) టీంకు శబ్ద యంత్రం ద్వారా సమాచారం ఇవ్వడంతో టీం ప్రతినిధులు వెళ్లి మిగిలిన భోజనాలను సేకరించి స్థానిక వినాయకుని గుడి సమీపంలో ఉన్న వలస కూలీలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారి కడుపులోకి వెళ్ళే ఒక్కొక్క మెతుకు వారికి ప్రాణాన్ని పోసి వారిలో ప్రాణశక్తిని నింపేదనని అన్నారు. ఈకార్యక్రమంలో జన చైతన్య సమితి ప్రతినిధులు దాసరి విజయ్ బెన్నిబాబు, దాసరి కారుణ్య బాబు తదితరులు ఉన్నారు. ఆహారం మిగిలి ఉంటే 8886777767,9885557987 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇస్తే ఆహారాన్ని సేకరించి వృధా కాకుండా చూస్తామని నిర్వాహకులు తెలిపారు.

# దాతల సహకారం ఉంటే రాష్ట్రం త్వరగా అభివృద్ధి



**తాడికొండ మేజర్ న్యూస్:** దాతల సహకారం ఉంటే గ్రామాలు త్వరగా అభివృద్ధి చెందుతాయని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సాంకేతిక శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి చెందాలి అంటే ప్రభుత్వమే అన్ని పనులు చేయవలసిన పనిలేదని ఆర్థికంగా అభివృద్ధి చెందిన దాతలు తమ స్వంత గ్రామాలను అభివృద్ధి చేసుకోవడం శుభ పరిణామం అని అన్నారు. ఆదివారం నాడు తాడికొండ మండలంలోని పెదపరిమి, రావెళ్ల గ్రామాలలో సూద్ను గుంట రాఘవేంద్ర ప్రసాద్, కళ్యాణి దంపతుల సహకారంతో బీసీ కమ్యూనిటీ భవనాలను నిర్మించారు. వీటి ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా కేంద్ర గ్రామీణాభివృద్ధి సాంకేతిక శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర రావు, తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధి అనేది గ్రామస్తులు చేతుల్లోనే ఉన్నదని, ప్రభుత్వం కొంతమేరకే అభివృద్ధి చేయగలదని దాతల సహకారం ఉంటే గ్రామాభివృద్ధి చాలా త్వరగా అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. దాతలు సొంత నిధులతో ఈ రెండు కమ్యూనిటీ భవనాలను నిర్మించడం ఆనందదాయకమని, ఈ భవనాలను బీసీ కమ్యూనిటీ వారు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. అనంతరం దాతలు రాఘవేంద్ర ప్రసాద్ కళ్యాణి దంపతులను పెమ్మసాని చంద్రశేఖర్ తెనాలి శ్రావణ్ కుమార్ ఇరువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే అంగన్వాడీలకు మేలు

### - ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



**పెదకూరపాడు మేజర్ న్యూస్:** అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, హెల్పర్లు, ఇతర చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ తెలిపారు. ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మహిళలు,చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దటంలో అంగన్వాడీల పాత్ర అత్యంత కీలకమని వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వము ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. చరిత్రలో తొలిసారిగా అంగన్వాడి వేతనాలను రెండుసార్లు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలలో త్రాగునీటి సౌకర్యాలు మరుగుదొడ్లు నిర్మించటం తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రతి కేంద్రానికి టీవీ,టాయిలెట్ సౌకర్యం, టీచర్లు,ఆయాల నియామకం వేసవిలో 15 రోజుల సెలవులు,వంట పాత్రలు అందించామని అన్నారు. సంవత్సరాల తరబడి అంగన్వాడీలకు గ్రాడ్యువిటీ అందలేదని కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల మేరకు 20 కోట్ల రూపాయలు కేటాయించి 9 నెలలలో వారికి అందించడం జరిగిందని మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్లుగా పూర్తిస్థాయి వేతనాలు అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. అంగన్వాడీలు ప్రతిపాదించిన తొమ్మిది కోరికలలో ఇప్పటికే పరిష్కారం చేయడం జరిగిందని, జీతాల పెంపు అంశాన్ని కూడా త్వరలో అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రతినెలా ఒకటవ తేదీనే వేతనాలు చెల్లించడం ఉద్యోగులకు భరోసాగా నిలుస్తుందని ఆయన అన్నారు.

# హిందువుల మనోభావాలు దెబ్బతీశారని కూటమి నాయకులపై ఫిర్యాదు




**తాడికొండ మేజర్ న్యూస్ :** హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా కూటమి నాయకులు మాట్లాడారని ఇంకా పలు మీడియా ప్రతినిధులు కూడా హిందువులు మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించారని శ్రీకాకుళం జిల్లాకు చెందిన డి.ఎస్.పి దేవరకొండ నాగవర ప్రసాద్ తుళ్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, టీవీ 5 ఈనాడు, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి,పలు టీవీ మరియు పత్రిక ఛానల్ అధిపతిలపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ హిందువుల ఆరాధ్య దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డు నందు జంతువు కొవ్వు కలిసిందని అసత్య ప్రచారాలు చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీశారని, దానిలో నిజం ఉన్నదో లేదో తెలియకుండా పలు టీవీ చానల్స్ డిబేట్ లు నిర్వహించారని, మా ఆరాధ్య దైవం అయిన వెంకటేశ్వర స్వామి లడ్డులో జంతువుల కొవ్వు అవశేషాలు కలిపారని పదేపదే ఆరోపణలు చేయటంతో మనస్థాపం చెంది నాయకుల పైన వివిధ చానల్స్ వారిపై కేసు నమోదు చేశానని ఆయన తెలియజేశారు. ఫిర్యాదు చేసిన డిఎస్పి దేవరకొండ నాగవర ప్రసాద్ గతంలో అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ గా పనిచేసి ప్రస్తుతం విజయవాడలో నివసిస్తూ మెడికల్ లీవ్ లో ఉన్నానని ఆయన అన్నారు.

## ఈపూరులో ఆంజనేయస్వామిని దర్శించుకున్న చీఫ్ విప్ జీవీ

**వినుకొండ మేజర్ న్యూస్ :** వినుకొండ నియోజకవర్గం ఈపూరు గ్రామంలో వెలసిన శ్రీ బోటి మీద ప్రసన్నాంజనేయ స్వామి వారి తిరణాల సందర్భంగా, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాటు చేసిన పులిహోర, వెజిటేబుల్ రైస్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# భూ వివాదాల్లో బొల్లాజైలుకు వెళ్లడం ఖాయం ప్రభుత్వ చీఫ్ విప్ జీవి

– అసత్య ప్రచారాలకు బ్రాండ్ అంబాసిడర్ బొల్లా
– పల్నాడు సమగ్ర అభివృద్ధికి సీఎంను కలవనున్న జిల్లా ఎమ్మెల్యేలు.



**వినుకొండ మేజర్ న్యూస్:** ఐదేళ్ల వైసిపి పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని బొల్లా బ్రహ్మనాయుడు చేసిన భూ ఆక్రమణలు, దందా ల వివాద కేసుల్లో బొల్లా జైలుకు వెళ్లడం ఖాయమని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బొల్లా బ్రహ్మనాయుడు ఐదేళ్ల వైసిపి పాలనలో ఎమ్మెల్యే అధికారం అడ్డం పెట్టుకొని ప్రభుత్వ భూమిలే కాకుండా దౌర్జన్యంగా ప్రైవేటు భూముల్ని కూడా ఆక్రమించారని విమర్శించారు. భూ దందాలకు పాల్పడిన బొల్లా దొంగే.. దొంగ.. దొంగ అన్న చందంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారాన్ని అడ్డం పెట్టుకున్న బ్రహ్మనాయుడు వినుకొండ కొండ చుట్టూ దౌర్జన్యంగా, కారు చౌకగా భూములు కాజేసి చుట్టూ రోడ్లు వేసుకునేందుకు రామలింగేశ్వర స్వామి కల్లోకి వచ్చాడని, గిరి ప్రదర్శన రోడ్డు వేస్తానని ప్రజాధనంతో తన భూముల వరకు రోడ్లు వేయించుకొని ప్రజలను మోసం చేశాడని అన్నారు. కారంపూడి రోడ్డు చెక్కవాగు వద్ద 4 ఎకరాలు భూమిని కొన్న బొల్లా దళిత క్రిస్టియన్ కు చెందిన జోసెఫ్ ఫ్రెడిక్ 2 ఎకరాల భూమిని ఆక్రమించాడని, కొండ వద్ద ఒక బీసీ పేద కుటుంబానికి చెందిన కనమల నాసరయ్య భూమిని అక్రమంగా కాజేచేశారని, వెంకట్రావు, హనుమంతరావు లకు చెందిన ప్రైవేటు ఆస్తులను దౌర్జన్యంగా బ్రహ్మనాయుడు ఆక్రమిస్తే బాధితుల కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. ఇలా ఎన్నో ప్రభుత్వ ప్రైవేటు భూములను ఆక్రమించిన బొల్లా బ్రహ్మనాయుడు పై కోర్టులో కేసులు నడుస్తున్నాయని, భూ వివాదాల కేసుల్లో బ్రహ్మనాయుడు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. గంజాయి, గుట్కా, మట్కా, మట్టి, ఇసుక ఇలా అవినీతి అక్రమాలను నియోజకవర్గం వైసీపీ నాయకులకు మండలాల వారీగా పంచి నాడు 'దీ' టాక్స్ వసూలు చేసావని అన్నారు. అవినీతి, అక్రమాలు, భూ దందాలు చేసిన నీవు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించే స్థాయి నీకు లేదని చీఫ్ విప్ జీవి ఖండించారు. నాడు టిడిపి పాలనలో తాము శాశ్వతంగా త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు 160 కోట్లు తెచ్చామని, 500 కోట్లు విలువచేసే చీఫ్రా స్థలాన్ని మున్సిపాలిటీకి బదలాయిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు క్యాబినెట్ ఆమోదంతో 146 జీవో ఇవ్వటం జరిగిందన్నారు. దానిని కూడా నేనే తెచ్చానని బ్రహ్మనాయుడు అసత్య ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఘాట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసింది నేనని, ప్రజల భాగస్వామ్యంతో రామలింగేశ్వర స్వామి దేవాలయానికి శ్రీకారం చుట్టింది మేమేనని చీఫ్ విప్ జీవి స్పష్టం చేశారు. తాము అభివృద్ధికి శంకుస్థాపనలు చేస్తే అవన్నీ మేమే చేశామని బీరాలు పలుకుతూ అసత్య ప్రచారాలు చేసుకోవటం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలలో వినుకొండ అభివృద్ధికి ఒక్క రూపాయి అయినా నిధులు తెచ్చావా అని ప్రశ్నించారు. కొండ ఘాట్ రోడ్డు, గిరి ప్రదర్శన రోడ్డు, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, మెట్ల మార్గాన్ని ప్రజల భాగస్వామ్యంతో మేము పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 210 కోట్లతో వినుకొండ పట్టణ శాశ్వత త్రాగు నీటి పథకాన్ని త్వరలో పూర్తి చేసి చూపిస్తామని వివరించారు. వరికపొడిసెల ప్రాజెక్టుకు అన్ని అనుమతులతో పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అలాగే త్వరితగతిన ఎన్ఎస్పి స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్, స్టేడియం తదితర అభివృద్ధి కి నిధులు ఇస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని త్వరలోనే అభివృద్ధి పనులు జరుగుతాయని స్పష్టం చేశారు. చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బ్రహ్మనాయుడు చేస్తున్న నిరాధారమైన విమర్శలకు ఆరోపణలకు తాము సమాధానం చెప్పవలసిన అవసరం లేదని, మీకు తగిన విధంగా మా నాయకులు, ప్రజలు సమాధానం చెబుతారని ఇప్పటికైనా అసత్యాలు మాని వాస్తవాలు మాట్లాడడాలని హితవు పలికారు. టిడిపిలో నాయకులు కార్యకర్తలు మధ్య చిచ్చు పెట్టేందుకు బ్రహ్మనాయుడు రెచ్చగొట్టే తీరును మా శ్రేణులు గ్రహిస్తున్నారని, మీకు తగిన విధంగా బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పల్నాడు జిల్లా సమగ్ర అభివృద్ధికి మార్చి ఏడో తేదీన జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులు సీఎం చంద్రబాబు నాయుడుని కలవనున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లాను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్ది, ప్రతి రైతుకు లక్ష రూపాయలు ఆదాయం పెంచడంమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అలాగే జిల్లాలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములన్ని ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. అభివృద్ధి దిశగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. బొల్లాకు మతిభ్రమించింపాల్గొన్నార వినుకొండ నియోజకవర్గంలో సొసైటీ చెరువులు ఎన్ని ఉన్నాయో కూడా తెలియని బొల్లా బ్రహ్మనాయుడు మతిభ్రమించి మాట్లాడుతున్నాడని జిడిసిసిబి చైర్మన్ మక్కన మల్లికార్జున రావు విమర్శించారు. వేల్పూరు సొసైటీ చెరువును మీ ఎంపీపీ అనిల్ కుమార్, ఈపూరు సొసైటీ చెరువును వైసిపి నాయకుడు బుచ్చయ్య చౌదరి, కనుమల్లపూడి చెరువు వైసీపీ జడ్పిటిసి చౌడయ్య చేస్తున్నారని, పెద్దకంచెర్ల చెరువు ఒక్కటే సొసైటీ చెరువు కాదని, బ్రహ్మనాయుడు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. వ్యక్తిగత విమర్శలు చేస్తున్న బొల్లా బ్రహ్మనాయుడు ఒక పాల వ్యాపారిగా వందల కోట్లు ఎలా సంపాదించాడో ప్రజలకు చెప్పాలన్నారు. కల్తీ పాలు, అవినీతి, అక్రమాలు, దందాలు చేసి కోట్లకు పడగలెత్తిన బొల్లా సీఎం చంద్రబాబు నాయుడును, చీఫ్ విప్పి జీవి ఆంజనేయులు విమర్శించే స్థాయి కాదని ఖండించారు. వ్యక్తిగత స్వార్థం కోసం అధికారం అడ్డం పెట్టుకొని నాడు బ్రహ్మనాయుడు కోల్డ్ స్టోరేజీని వేల్పూర్ లో నిర్మించి రైతులకు అన్యాయం చేశాడన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని అడిగిన రైతుపై చెప్పుతో దాడి చేసి హత్యాయత్నం కేసు పెట్టిన దుర్మార్గుడు బ్రహ్మనాయుడు అని అన్నారు. నాయకులు పాల్గొన్నారు.


# పేద ప్రజల సేవకే శివశక్తి ఫౌండేషన్

### ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



**వినుకొండ మేజర్ న్యూస్ :** పేదలకు సేవ చేసేందుకే శివశక్తి లీల అండ్ అంజన్ ఫౌండేషన్ స్థాపించి గత 27 ఏళ్లగా ప్రజలకు సేవ చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. స్థానిక గంగినేని ఫంక్షన్ హాల్ లో ఆదివారం శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర కంటి నేత్రాలయం సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయగా చీఫ్ విప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఫౌండేషన్ ద్వారా నా కుమారుడు, నా మనవడు వారి తర్వాత నా వారసులందరూ శివశక్తి ఫౌండేషన్ ద్వారా ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తూనే ఉంటారని స్పష్టం చేశారు. ఫౌండేషన్ ద్వారా వినుకొండ నియోజకవర్గంలోనే కాకుండా మన చోట్ల నుండి వచ్చిన వేలాదిమంది వృద్ధులకు కంటి శుక్ల ఆపరేషన్లు చేయించడం జరిగిందన్నారు. శివశక్తి అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





కంటి వైద్య శిబిరానికి 520 మంది వృద్ధులు హాజరు కాగా, శంకర కంటి నేత్రాల నుండి వచ్చిన వైద్య నిపుణులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని పౌండేషన్ మేనేజర్ ఫణికుమార్ తెలిపారు. వీరిలో 370 మందికి కంటి శుక్ల ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించినట్లు, వీరందరికీ శంకర కంటి ఆస్పత్రికి తరలించి కంటి శుక్ల ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని మేనేజర్ తెలిపారు. డీసీసీబీ చైర్మన్ మక్కెనా మల్లికార్జునరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గీతాంజలి స్కూల్స్‌లో మహిళా దినోత్సవ వారోత్సవాలు ప్రారంభం

**వినుకొండ మేజర్ న్యూస్:** స్థానిక గీతాంజలి స్కూల్స్‌లో మహిళా దినోత్సవ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణ సీఐ ప్రభాకర్, ఎస్సై ఉదయలక్ష్మి, ఎస్సై పుల్లారావు, ఎస్సై నరేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మహిళల పట్ల గౌరవభావం విద్యార్థి దశ నుంచే పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి మహిళలో తల్లిని, ప్రతి బాలికలో తోబుట్టువులను చూడాలనే సందేశం ఇచ్చారు. ప్రిన్సిపల్ తేళ్ల కృష్ణవేణి, కరస్పాండెంట్ వైఎల్ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం సర్వసభ్య సమావేశం



**తెనాలి, మేజర్ న్యూస్ :** స్థానిక బోస్ రోడ్ల గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం పాలకమండలి సర్వసభ్య సమావేశం ఆదివారం దేవస్థానం అధ్యక్షుడు వేంకట వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 2025-2026 సంవత్సరానికి గాను జమా ఖర్చుల పరిశీలన నూతన పాలక మండలి ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. నూతన పాలకమండలి నియామకానికి ఏప్రిల్ నెల 26వ తేదీన ఎన్నికల నిర్వహించేందుకు సమావేశాలు తీర్మానం చేశారు. దేవస్థాన పాలకమండలి విషయంలో గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు రంగంలో దిగి సమావేశం సజావుగా సాగేందుకు కృషి చేశారు. కేవలం సభ్యత్వం ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించి ఇతరులను సమావేశానికి కుండా చూడడంతో సమావేశం సజావుగా సాగింది. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ జనరల్ బాడీ సభ్యులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. తెనాలి డీఎస్పీ బి జనార్ధనరావు ఆధ్వర్యంలో పోలీసులు గొడవలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

## ఘనంగా కుమ్మర శాలివాహన సంఘం సమావేశం



**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్:** స్థానిక సీ ఏ ఎన్ కోటేశ్వరరావు కళ్యాణమండపంలో ఏపీ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పారెళ్ళ బసవేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సంఘీయులను అందరిని కలుపుకొని సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తామని చెప్పారు. ఆదిశేషయ్య మాట్లాడుతూ కుమ్మర శాలివాహనులు ఆర్థికంగా వెనకబడి ఉన్న కారణంగా ప్రభుత్వం అన్ని విధాలుగా వారి అభివృద్ధికి సహకరించాలని కోరారు. గుంటూరు జిల్లా అధ్యక్షులు ఇందుర్తి శివన్నారాయణ మాట్లాడుతూ జిల్లాలో సంఘీయులకు ఏ సమస్య వచ్చినా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ముందుండి పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు శాలివాహనులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తుగ్గలి నాగేంద్ర, గౌరవాధ్యక్షులు పద్మ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బెజవాడ అది శేషయ్య, కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు, గుంటూరు జిల్లా అధ్యక్షులు ఇందుర్తి. శివన్నారాయణ మరియు వివిధ జిల్లాల అధ్యక్షులు నడికుడి వెంకటేశ్వరరావు, నాగన్న పైడి కొండ తదితరులు పాల్గొనారు.

# ధర్మకర్త రుద్రు దంపతులకు సత్కారం



**మంగళగిరి,మేజర్ న్యూస్:** నగరంలోని శ్రీ లక్ష్మినరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలుగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన శ్రీమతి రుద్ర త్రిశూల ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరావు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు దేశం తమ్ముళ్లు నవులూరులో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. రుద్రు త్రిశూల, శ్రీనివాసరావు దంపతులను దానబోయిన, నాయకులు శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. అనంతరం సుందరరావు యాదవ్ మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికలలో మంత్రి నారా లోకేష్ విజయానికి రుద్రు శ్రీనివాసరావు దంపతులు ఎంతో కృషి చేశారన్నారు. రుద్రు దంపతులు పార్టీకి చేసిన సేవలను గుర్తించి శ్రీమతి త్రిశూలకు మంత్రి నారా లోకేష్ దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలుగా నామినేట్ చేసి గౌరవించడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ యాదవ సామాజిక వర్గం, బీసీలకు నామినేటెడ్ పదవులలో పెద్దపీట వేయడం సంతోషకరమన్నారు. దేశంలోనే మంగళగిరి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి మంత్రి నారా లోకేష్ అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రుద్రు కోటేశ్వరరావు, తోట శ్రీను బాబు, మల్లవరపు వెంకట్, బత్తుల నాగరాజు, కొల్లి వెంకట్రావు, తోట సాంబ, కొత్త శ్రీనివాసరావు, మర్రి ఏసుబాబు, రుద్రు గోపి, నాగరాజు, పొన్నం శ్రీను, తోట పానకాలు, దేశబోయిన వెంకట్రావు, వంకాయల శ్రీనివాసరావు తదితరు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు అన్నదానం



మంగళగిరి, మేజర్ న్యూస్: నగరంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం వద్ద శివ భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పెదవడ్లపూడి మాజీ సర్పంచ్ అన్నే చంద్రశేఖర్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం అన్నే, మన్నెం మాట్లాడారు. అన్ని దానాల్లో కెల్ల అన్నదానం మిన్న అని శాస్త్రాలు చెబుతున్నాయని, సుమారు 33 సంవత్సరాల నుంచి శివ భక్త బృందం ప్రతి నెలలో వచ్చే మొదటి ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం కొనసాగించుకుంటూ రావడం అభినందనీయమన్నారు. భక్తులతోపాటు ఈ ప్రాంతంలో పేద మధ్య తరగతి ప్రజలు కూడా అన్నదానంలో పాల్గొని అన్నప్రసాదాన్ని సంతోషంగా స్వీకరిస్తున్నారన్నారు. భవిష్యత్తులో అన్నదాన కార్యక్రమానికి తమ సహాయ సహకారాలు కూడా ఉంటాయన్నారు. మహత్తరమైన అన్నదాన కార్యక్రమానికి మరి కొంతమంది దాతలు కూడా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో శివ భక్త బృందం ప్రతినిధులు గుండా రామాంజనేయులు, అన్నే నంద కిషోర్, శివాలయం మాజీ ధర్మకర్త అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, భక్త బృందం ప్రతినిధులు ఆనందరావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగ్రహణం సందర్భంగా నేడు అమరేశ్వర దేవాలయం మూత



పెదకూరపాడు మేజర్ న్యూస్: : శ్రీ బాల చాముండిక సమేత అమరేశ్వర స్వామి దేవస్థానం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి పాల్గొన శుద్ధ పూర్ణిమ కేతు గ్రహ సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా దేవాలయము మూసివేయనున్నట్లు సహాయ కమిషనర్ రేఖ తెలిపారు. పునః ప్రారంభం నాలుగవ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు సంప్రోక్షణ అనంతరం గుడి తెరవబడుతుందని ఆమె అన్నారు. భక్తులు గమనించగలరని తెలిపారు.

# సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి



గుంటూరు రూరల్, మేజర్ న్యూస్: జనసేన పార్టీ ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన క్రియాశీల సభ్యత్వంలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గ గుంటూరు రూరల్ మండలం లాలుపురం గ్రామానికి చెందిన కాటూరు శ్రీనివాసరావు మాస్టర్ 500 పైగా సభ్యత్వాలు పూర్తి చేసినారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు క్రియాశీల సభ్యత్వానికి సెంట్రల్ ఆఫీస్ కోఆర్డినేటర్ చందు సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొని శ్రీనివాస్ మాస్టర్ ని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా చందు సాంబశివరావు మాట్లాడుతూ...ప్రత్తిపాడు నియోజకవర్గంలో గుంటూరు రూరల్ మండలం నుంచి అత్యధికంగా సభ్యత్వాలు జరగటం ఆనందదాయకం. ఈ కార్యక్రమాన్ని నాయకులు ముందుండి సాధక ల తో సమన్వయం చేసుకుంటూ సభ్యత్వాలు అత్యధికంగా అయ్యేటట్లు కృషి చేయాలని ఆకాంక్షించారు. కొర్రపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత సంవత్సరం కూడా ప్రత్తిపాడు నియోజకవర్గంలో లాల్పురం గ్రామం నుంచి వ్యక్తిగత అత్యధిక సభ్యత్వాలు నమోదవడం, ఈ సంవత్సరం కూడా అదే గ్రామం నుంచి మొదట 500 పూర్తి అవడం ఆనందకరశి. జనసేన పార్టీకి బలమైన గ్రామంగా ఉందని శ్రీనివాస్ మాస్టర్ ని స్ఫూర్తిగా తీసుకొని నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుండి సభ్యత్వాలు అత్యధిక సంఖ్యలో నమోదు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ లేబర్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ చింతా రేణుక రాజు, కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ శ్రీనివాస్, నాగినేని సునీల్ కుమార్, అక్కి రవి, శేషం చిన్న సుబ్బారావు, దేవరశెట్టి లక్ష్మీనారాయణ, సజ్జల రవి, వీ రాంబాబు, పి విరయ్య , చెన్నం గోపి, తోట వెంకటేష్, ఆకుల శేషు, అమ్ములోతు రాంబాబు, ఆదూరి శివయ్య, శీలం హరి తదితరులు పాల్గొన్నారు.

# కెఎల్‌యులో విజయవంతంగా స్కిల్ పలావర్ స్లాట్ 2



తాడేపల్లి మేజర్ న్యూస్ : కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని స్కిల్ డెవలప్ మెంట్ విభాగం ఆధ్వర్యంలో 2025--26 విద్యా సంవత్సరానికి గాను శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు స్కిల్ పలావర్ యొక్క మూడవ దశ యొక్క ఫైనల్ స్లాట్ ను విజయవంతంగా నిర్వహించారు. స్కిల్ పలావర్ అనేది రెండు సెమిస్టర్లలో నిర్వహించబడే సమగ్రమైన, ప్రాజెక్ట్-ఆధారిత హ్యాకథాన్ ఫ్రేమ్‌వర్క్. ఇది లీనమయ్యే అనుభవపూర్వక అభ్యాసం మరియు స్పష్టంగా నిర్వచించబడిన, ఫలిత-ఆధారిత సామర్థ్య అభివృద్ధి ద్వారా విద్యార్థుల పరిశ్రమ సంసిద్ధతను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చొరవ వ్యూహాత్మకంగా డొమైన్-నిర్దిష్ట హ్యాకథాన్‌లను ప్రొఫెషనల్ ఎలక్టివ్‌లు మరియు పరిశ్రమ-సమలేఖన నైపుణ్య కోర్సులలో లెర్న్ థాన్, సమీక్ష, ఫైనల్ హ్యాకథాన్‌లతో కూడిన కఠినమైన నిర్మాణాత్మక మూడు-దశల నమూనాల ద్వారా అనుసంధానిస్తుందని కెఎల్ స్కిల్ డెవలప్ మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థ యొక్క ప్రధాన భాగంలో వాస్తవ-ప్రపంచ, అప్లికేషన్-ఆధారిత సమస్య పరిష్కారాన్ని సంస్థాగతీకరించడం ద్వారా విద్యా-పరిశ్రమ కలయికను బలోపేతం చేయడంలో స్కిల్ పలావర్ ఒక పరివర్తనాత్మక, వ్యూహాత్మక మైలురాయిని సూచిస్తుందని తెలిపారు. ఈ చొరవ కెఎల్ సాంకేతికంగా నైపుణ్యం కలిగిన, ఆవిష్కరణ-ఆధారిత, పరిశ్రమ-సిద్ధంగా ఉన్నవట్ట భద్రులను పెంపొందించడానికి విశ్వవిద్యాలయం యొక్క అచంచలమైన నిబద్ధతగా బలపరుస్తుందని అన్నారు. అధునాతన సామర్థ్యాలు, అనుకూల నైపుణ్యం, సజావుగా, ప్రభావవంతమైన శ్రామిక శక్తి ఏకీకరణకు అవసరమైన వృత్తిపరమైన నైపుణ్యంతో సన్నద్ధమైందని అన్నారు. సిఎస్ ఇ, ఎఐడిఎస్, సిఎస్ ఐటి, ఇసిఇ, ట్రిపుల్ ఈ, ఐఒటి, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, బిసిఎ, ఎంసిఎ నుండి మొత్తం 5 వేల 5వందల 46 మంది విద్యార్థులు ఈ దశలో చురుకుగా పాల్గొన్నారు. ఈ హ్యాకథాన్‌లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఐఒటి, అటానమస్ వెహికల్స్, ఫైవ్+ టెక్నాలజీ, బ్లాక్‌చెయిన్, వివిఎల్ఎస్ఐ , ఎంబెడెడ్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డిజైన్ మరియు అనాలిసిస్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, గేమ్ డిజైన్ వంటి అభివృద్ధి చెందుతున్న, అధునాతన డొమైన్‌లను కవర్ చేశాయని తెలిపారు.ఎఐ ఎంఎల్ సవాల్-- 1లో 852 మంది విద్యార్థులు అత్యధికంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత 659 మంది సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, 606 మంది విద్యార్థులు జెన్ ఎఐ హాక్ వంటి కోర్సులలో ఉన్నారని చెప్పారు. ఇతర ప్రధాన కార్యక్రమాల్లో క్లౌడ్ ఛాలెంజ్ -- 1లో 560 మంది పాల్గొనగా, డేటా-డ్రివెన్ ఎమోషన్ హ్యాక్ లో 384 మంది పాల్గొన్నారు. ఎన్ ఎల్ పి ఇన్నోవేటర్స్ హ్యాక్ లో 346 మంది, బైట్‌బిల్డర్స్ ఛాలెంజ్ లో 335 మంది, క్లౌడ్‌క్యూ బిల్డథాన్ లో 318 మంది, డీబగ్ డ్రైవ్ షోడౌన్ లో 309 మంది విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని తెలిపారు. ఇంటిగ్రిటెక్ బిల్డథాన్ లో 251, ఐఒటి ఫ్యూజన్ హ్యాకథాన్ లో 231, వంటి డొమైన్-కేంద్రీకృత కార్యక్రమాలు ప్రధానంగా నిలిచాయని అన్నారు. ల్యాబ్‌వ్యూ వర్చువల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ లో141 మంది, మొబిలిటీ ఎక్స్ హాక్‌ఫెస్ట్ లో 133 మంది, సైబర్‌స్కోప్, అనలిటిక్స్ ఫర్ డిఫెన్స్ 109 మంది, గేమ్‌ఫోర్జ్ హ్యాకథాన్ లో 90 మంది, డీప్‌హాక్ 2025 లో 81 మంది, మల్టీఫిజిక్స్ సిమ్యులేషన్ స్ప్రింట్ లో 55 మంది, క్రిప్టోజెనిసిస్ హ్యాకథాన్ లో 50 మంది, ఎకోస్ట్రట్ హ్యాకథాన్ లో 50 మంది, కనెక్ట్‌ఎక్స్ ది 5జి ఇన్నోవేషన్ ఛాలెంజ్ లో 50 మంది విద్యార్థులతో ప్రత్యేక అధునాతన సాంకేతిక కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఫోర్డ్ మోటార్ కంపెనీ, ఐబిఎం, సిస్కో హెచ్ అండ్ ఎం గ్రూప్, మోంగో డిబి , సినోప్సిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అన్సిస్, ఫ్లిప్‌కార్ట్, లాయిడ్ టెక్నాలజీ సెంటర్, రెస్ మెడ్ , పెర్సిస్టెంట్ సిస్టమ్స్, టాటా ఎల్క్సి, కె పిట్ టెక్నాలజీస్ లిమిటెడ్, కేర్‌లాన్ గ్లోబల్ సొల్యూషన్స్, నైట్ ఫ్రాంక్, ఈ 42 లైట్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ, ఇండియన్ సర్వర్స్, టి సారో లాబ్స్ వంటి పరిశ్రమల నిపుణుల నుండి నిరంతర మార్గదర్శకత్వం, మూల్యాంకన మద్దతు లభించిందన్నారు. లెర్న్ థాన్, రివ్యూ, ఫైనల్ హ్యాకథాన్ అనే మూడు దశలలో కంపెనీల వారి ప్రమేయంతో విద్యార్థులలో ప్రాజెక్టుల పరిశ్రమ నైపుణ్యాన్ని, ఆచరణాత్మక ధోరణిని గణనీయంగా బలోపేతం చేసిందన్నారు. ఈ నిర్మాణాత్మక స్కిల్ పలావర్ లో పాల్గొన్న విద్యార్థులలో దాదాపు 70 శాతం మంది అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలలో పరిశ్రమ సంసిద్ధతను ప్రదర్శించారు. ముఖ్యంగా, హ్యాకథాన్ సమయంలో ఫంక్షనల్ ప్రోటోటైప్‌లు, అమలు చేయగల పరిష్కారాల అభివృద్ధిలో ఎఐ సాధనాలు, ఫ్రేమ్ వర్క్‌లను సమర్థవంతంగా ఉపయోగించుకుని, పరిశ్రమ నిపుణుల అభిప్రాయం ప్రకారం దాదాపు 60 శాతం మంది విద్యార్థులు ఎఐ సంసిద్ధతను సాధించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యాచరణ ఫ్రేమ్ వర్క్ ను కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. రాజేష్ రూపొందించగా, ఆయా విభాగాధిపతులు నియమించబడిన డొమైన్ స్పోక్ లతో దగ్గరి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నైపుణ్యాభివృద్ధి డీన్ డాక్టర్ ఎ. శ్రీనాథ్ సమర్థవంతంగా, వ్యూహాత్మకంగా నడిపించారు. ఈ కార్యక్రమం వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారది వర్మ, ప్రో వైస్-ఛాన్సలర్ డాక్టర్ ఎన్ వెంకట్రామ్ యొక్క మార్గదర్శకత్వంలో నిర్వహించబడిందన్నారు.

# బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో బియ్యం వితరణ





వినుకొండ మేజర్ న్యూస్: వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యములో ఆదివారం విద్యానగర్ 4వ లైన్ లోని సిహెచ్.రఘు మాస్టారు ఇంటి వద్ద 106 వ బియ్యం వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి దాతలు గోపాలుని విజయ, రాయసం సుజాత, చింతల చెర్వురఘు, చింతలపూడి కృష్ణ మోహన్ సహాయ,సహ కారములతో నాలుగు కుటుంబ ములకు బియ్యం, నిత్యావసరవస్తువులు అందజేశారు.ముందుగా పరాభవ నామ సంవత్సరం నూతన పంచాంగ ములు ఆవిష్కరణ చేశారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా నియోజకవర్గం పరిధిలో నూతన పంచాంగములు వితరణ చేయు చున్న శ్రీనివాసుని శ్రవణ కుమార్ కి పూలమాల, దుస్సాలువతో ఘనంగా సన్మానించుకొని వారు ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు అనంతరం నియోజకవర్గపరిధిలో,క్యాటరింగ్ అధ్యక్షులు గా ఎన్నికైన గోపాలుని నాగ రాజు ని శాలువా,పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాలి శ్రీనివాసరావు, జీవి. మాధవరావు, ధూళిపాళ్ళ నాగేశ్వరావు, చింతలపూడి భద్రయ్య, అన్నా ప్రగడ వెంకటేశ్వర రావు భువనగిరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


# పొన్న వాహనంపై నరసింహుడు



**మంగళగిరి, మేజర్ న్యూస్:** నగరంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన ఆదివారం రాత్రి స్వామివారు పొన్న వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చక స్వాములు స్వామివారి ఉత్సవ మూర్తులను వాహనంపై అధిష్టింప చేసి రంగు రంగు పూలమాలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆ విద్యుత్ కాంతుల మధ్య పెండ్లి కుమారుడైన నరసింహుడు దేదీప్యమనంగా వెలుగొందుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవస్థానం ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అర్చక బృందం పూజలు నిర్వహించారు. ఉత్సవ విశిష్టతను శ్రీనివాస దీక్షితులు వివరించారు. ఉత్సవంలో చూపించే గోపికలు అందరూ కలిసి స్నానంకు వెళ్లడం, భక్తులు పరస్పరము ఆధ్యాత్మికంగా సహకరించుకుంటూ ఒకరికొకరు చేయూతనిచ్చుకొనుచు నడిచిపోవాలని తెలియజేస్తుందన్నారు. స్వామి గోపికల వస్త్రములను అపహరించారన్నారు. స్వామి గోపికల వస్త్రములను అపహరించి వారిలో ఉన్న దేహాభిమానాన్ని తొలగించి, విముక్తిని ప్రసాదించారన్నారు. స్వామి అపహరించినది వస్త్రములను కాదని, వాసనలు అపహరించారన్నారు. పాంచభౌతిక శరీరంపై వ్యామోహం ఉన్నంత వరకు, ముక్తి దుస్సాధ్యమని, పొన్న వాహనోత్సవం ద్వారా స్వామి భక్తులకు బోధిస్తున్నారన్నారు. వాహనోత్సవములో స్వామిని దర్శించిన వారికి దేహాభిమానం తొలగి స్వామి



కృపకు పాత్రులు అవుతారన్నారు. పొన్న వాహనోత్సవంకు ప్రత్యేకత ఉండటంతో పట్టణ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. దీంతో దేవస్థానం ప్రాంతం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా దేవాలయం ఎదుట ప్రత్యేకమైన బాణాసంచా కాల్పులు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామోత్సవం తొలుత దేవస్థానం నాలుగు మాడవీధులలో నిర్వహించి, అనంతరం మెయిన్ బజార్ మీదుగా మిద్దె సెంటర్ కు సాగింది. విచిత్ర వేషధారణలు, కోలాట భజనలు, బాణాసంచా పేలుళ్లు, మేళతాళాలు, కనక తప్పట్లు, తీన్మార్ ల మధ్య ఉత్సవం నిర్వహించారు. ఆయా సెంటర్లలో భక్తులు పెద్ద సంఖ్యల హాజరై స్వామివార్లను దర్శించుకుని, టెంకాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉత్సవానికి స్థానిక పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం కైంకర్యపరులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం ఎదుట శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికపై నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. దేవస్థాన సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వాహణాధికారి కోగంటి సునీల్ కుమార్, ధర్మకర్తల మండలి పర్యవేక్షించారు.



## భాగ్యరాజు సేవలు మరువలేనివి



**మంగళగిరి, మేజర్ న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారానికి జీవితాంతం కట్టుబడి పనిచేసిన సిపిఎం నాయకుడు, సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. భాగ్యరాజు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం మంగళగిరి ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు గోరంట్ల మహేష్ అధ్యక్షతన భాగ్యరాజు మృతికి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థి సమస్యలపై అనేక ఉద్యమాలు నడిపిన నాయకుడిగా భాగ్యరాజు పేరుపొందారని తెలిపారు. యువజన సంఘం నాయకుడిగా యువత సమస్యలపై, కార్మిక సంఘం నాయకుడిగా మంగళగిరి మరియు రాజధాని గ్రామాలలో కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశారని గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా సమరశీల దృక్పథంతో ముందుండి పరిష్కారానికి కృషి చేసేవారని కొనియాడారు. భాగ్యరాజు మృతి కార్మిక లోకానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని వారు పేర్కొన్నారు. అనంతరం భాగ్యరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో సిఐటియు సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, సిఐటియు రాజధాని కమిటీ అధ్యక్షుడు ఎం. రవి, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, జనసేన పార్టీ నాయకుడు కే. సుందరయ్య, ప్రముఖ న్యాయవాది శిఖ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా ఉద్యోగుల హర్షం

## జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరావు



**మాచవరం, మేజర్ న్యూస్ :** గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సీనియర్ శాసనసభ్యులుగా మాత్రమే కాకుండా ఉద్యోగుల పట్ల "ఫ్రెండ్లీ ఎమ్మెల్యే"గా కూడా తన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. తన నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కుటుంబ సభ్యుల్లా చూపిస్తున్న ఆదరణ, ఆప్యాయత ఎనలేనిది అని పల్నాడు జిల్లా ఏపీ జెఏసి జిల్లా అధ్యక్షుడు మాచవరం తాసిల్దార్ ఎన్ . నాగమల్లేశ్వర అన్నారు. తన నియోజకవర్గంలో ఏ అధికారి పదవీ విరమణ పొందినా లేదా బదిలీ అయినా, నియోజకవర్గం నకు వారి స్థాయిలో మన్ననలు పొందిన వారి సేవలను గౌరవిస్తూ సొంత ఖర్చులతో అభినందన సభ ఏర్పాటు చేస్తానని ప్రకటించడమే కాకుండా, ఆ మాటను ఆచరణలో చూపిస్తూ ఉద్యోగులు ఊహించని విధంగా ఘనంగా కార్యక్రమాలు నిర్వహించడం విశేషంగా ప్రశంసనీయమైంది. ఈ సందర్భంగా ఏపీ ఆర్ ఎస్ ఎ అమరావతి పల్నాడు జిల్లా సంఘం , నియోజకవర్గంలోని రెవెన్యూ ఉద్యోగులు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తూ, ఉద్యోగుల పట్ల ఇంతటి గౌరవం, ప్రోత్సాహం అందిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగుల సేవలను గుర్తించి గౌరవించడం ద్వారా పరస్పర విశ్వాసం, సమన్వయం పెంపొందుతుందని, ఇది ప్రజాప్రతినిధులు--ఉద్యోగుల మధ్య ఆదర్శప్రాయ సంబంధాలకు నిదర్శనమని సంఘ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రోత్సాహం భవిష్యత్తులో కూడా కొనసాగాలని కోరుతూ పల్నాడు జిల్లా ఉద్యోగులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ ఆర్ యస్ ఏ జిల్లా అధ్యక్షులు యన్ .నాగ మల్లేశ్వర రావు డివిజన్ అధ్యక్షులు ఎస్కే. బాషా, కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర సెక్రటరీ జి. శ్రీనివాస్ ,తహసీల్దార్ గురజాల,డివిజన్ వింగ్ అధ్యక్షులు కీర్తి సుధా స్రవంతి గురజాల తహసీల్దార్ దుర్గేశ్వరరావు, పిడుగురాళ్ల తహసీల్దార్ మధు, తదితరులు హర్షం వ్యక్త పరిచ్చినారు.

# రైల్వే గేట్ దాటుతూ వ్యక్తి దుర్మరణం

**తెనాలి మేజర్ న్యూస్ :** స్థానిక పినపాడు రైల్వే గేట్ వద్ద ఆదివారం ఉదయం రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో పినపాడుకు చెందిన కరేటి సురేష్ (46) దుర్మరణం పాలయ్యారు. సురేష్ తన పిల్లలకు అల్పాహారం తీసుకొచ్చేందుకు వచ్చి రైల్వే ట్రాక్ దాటుతుండగా అటుగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో ట్రాక్ పక్కన పడి అక్కడక్కడే మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పాండురంగపేట పినపాడు చెంచుపేట తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు సాధారణంగా ఇటువైపు ప్రయాణ సాగిస్తుంటారు. ట్రాఫిక్ ఇబ్బందిని ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని 2009వ సంవత్సరంలో ఇక్కడ బ్రిడ్జి నిర్మించేందుకు రైల్వే అధికారులు మున్సిపల్ అధికారులు పరిశీలన చేశారు. కానీ బ్రిడ్జి నిర్మాణం జరగలేదు. ఈ గేటు కుండా వేలమంది ప్రజలు వాహనాలు ప్రయాణం చేస్తుంటాయని తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రభుత్వము రైల్వే అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణం చేస్తే ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉంటాయని స్థానికులు కోరుతున్నారు. శనివారం కూడా మరో గుర్తుతెలియని వ్యక్తి ఇదే ప్రాంతంలో రైలు ప్రమాదంలో మృతి చెందటం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

## భాష్యం రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తులసీ విశ్వంభర్



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ జన్మదినోత్సవ సందర్భంగా వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ తనయుడు తులసి విశ్వంభర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్ లోని భాష్యం విద్యా సంస్థలలో ఏర్పాటుచేసిన వేడుకలలో రామకృష్ణను ఘనంగా సత్కరించి విశ్వంభర్ జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని,ఆయురారోగ్యాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విశ్వంభర ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గాజుల సాయిరాం, మూర్తి,మణి,అనిల్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎంలో ఘనంగా ముగిసిన టెక్నో కల్చరల్ ఫెస్ట్

**- విద్యార్థులను ఉర్రూతలూగించిన ప్లే బ్యాక్ సింగర్స్ కార్తీక్, జోనిత గాంధీ**



**మంగళగిరి, మేజర్ న్యూస్:** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నాలుగు రోజులు పాటు పండగ వాతావరణం లో జరిగిన టెక్నో కల్చరల్ ఫెస్ట్ ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. విద్యార్థుల ఆటలు, పాటలు డాన్సులు,ఫ్యాషన్ షో లతో పాటు మేదస్సు కు పదును పెట్టే టెక్నికల్ పోటీలు వేడుకగా జరిగాయి. యూనివర్సిటీలోని ఎనిమిది వేల మందికి పైగా విద్యార్థులు, ఉద్యోగులు వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొని మరచిపోలేని అనుభవాలను, ఆనందాన్ని సొంతం చేసుకున్నారు. శని ఆదివారాల్లో జరిగిన మ్యూజికల్ షోలో ప్రఖ్యాత సినీ నేపద్య గాయకులు కార్తీక్, జ్యోతికా గాంధీలు మధురమైన మెలోడీ గేయాలను ఆలపించి విద్యార్థులను ఆనంద డోలికల్లో తెలియాడించారు. అదేవిధంగా డీ జే గౌతం ప్రదర్శన విద్యార్థి లోకాన్ని ఎంతగానో ఆకట్టుకుంది.

**హెకదాన్లు , రోబోటిక్స్ ఛాలెంజస్...**




కోడింగ్ పోటీలు , వర్క్ షాపులు తదితర పోటీల్లో విజేతలైన విద్యార్థులను యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సతీష్ కుమార్, రిజిస్టర్ ప్రేమ్ కుమార్లు ప్రత్యేకంగా అభినందించారు . నాలుగు రోజులపాటు ఫెస్ట్ ను ఘనంగా నిర్వహించిన విద్యార్థి విభాగం డైరెక్టర్లు గురుప్రీత్సింగ్ , రేవతి బాలకృష్ణ, సిఎల్ఎం డైరెక్టర్ అనుప్ సింగ్ లతో పాటు స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ నివేద శ్రీరాములకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రశంసలు అందజేశారు.

ఎన్.లక్ష్మినారాయణ, రీజనల్ మేనేజర్, ఫోన్ నెం. 63011 07116